సాక్షి సిద్దిపేట

శుక్రవారం | 28 | ఏప్రిల్ | 2023



నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా నవోదయ ఎంట్రెన్స్‌కు సర్వం సిద్ధమైంది. ఈనెల 29వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



కల్యాణానికి సర్వం సిద్ధం

దుబ్బాక పెద్దమ్మ ఆలయం కల్యాణోత్సవానికి సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9లో

కొండపోచమ్మ సాగర్‌లో చేపలు పట్టొచ్చు

మర్కూక్(గజ్వేల్): కొండపోచమ్మసాగర్‌లో చేపలు పట్టేవారికి లైసెన్స్‌లు జారీ చేయనున్నారు. ఈమేరకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. పాములపర్తి, పాతూరు, చేబర్తి, శివారు వెంకటాపూర్, భవనందపూర్, మర్కూక్, నర్సన్నపేట, ఎర్రవల్లి, ఇప్పలగూడెం తదితర గ్రామాల మత్స్యకారులకు ఉపాధి దొరకనుంది.

న్యూస్‌రీల్

అవయవదానానికి ముందుకు రావాలి



అంగీకార పత్రాలు అందజేస్తున్న దాతలు

హుస్నాబాద్ : ప్రతీ ఒక్కరు అవయవ, నేత్ర, శరీరం దానం చేసేందుకు ముందుకు రావాలని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు బూట్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాజేందర్ కోరారు. హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో 14 మంది కాకతీయ మెడికల్ కాలేజీకి అవయవ, శరీర దానం చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. అంగీకార పత్రాలు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు అందజేసి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు.

అదనపు కలెక్టర్ రక్తదానం



రక్తదానం చేస్తున్న కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల్లో భాగంగా గురువారం రక్తదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 75 మంది పూర్వ విద్యార్థులు రక్తదానం చేయగా, 750 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు.కరీంనగర్ అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ రక్తదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఆశ్రయం ఫౌండేషన్ వైద్య విభాగం సహకారంతో ఉచితంగా వైద్య పరీక్షలు, రోగ నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆస్పత్రి నిపుణులు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వజ్రోత్సవ కమిటీ కన్వీనర్ కొండ లక్ష్మణ్, వైద్య శిబిరం కమిటీ కన్వీనర్లు అయిత శ్రీధర్, కె. రమేశ్, చింతకింది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, కమిటీ సభ్యులు కేడం లింగమూర్తి, కొత్తపల్లి అశోక్, వీరన్నయాదవ్, వీవీ రమణ, పందిల్ల శంకర్ పాల్గొన్నారు.

అంధత్వరహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం



మాత్‌పల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): అంధత్వ రహిత తెలంగాణే మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లిలో గురువారం ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణతో కలిసి కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకునేలా ఏఎన్ఎం, ఆశావర్కరు, పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు బచ్చలి మహిపాల్, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, ఎంపీడీవో రాంరెడ్డి, ఉపసర్పంచ్ బట్టు లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అర్షద్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ దుర్గయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాల శంకర్, లీడర్లు లక్ష్మణ్, కోల రవీందర్, రాజలింగం, కిష్టారెడ్డి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఎస్‌పై రౌండ్ టేబుల్ సమావేశం

కోహెడరూరల్(హుస్నాబాద్): హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 29న సీపీఎస్ విధానంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు టీసీపీఎస్ ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ తెలిపారు. గురువారం మండలంలోని శనిగరం స్టేజీ వద్ద ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 1.70 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు పెన్షన్ సౌకర్యం లేక భవిష్యత్ భద్రత కరువై ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు.

క్రీడలకు వేళాయే..

- 10 క్రీడాంశాలపై 21 చోట్ల శిక్షణ
- 16 గ్రామీణ, 5 పట్టణ ప్రాంతాల్లో శిబిరాలు
- క్రీడా సామగ్రి పంపిణీ
- వచ్చేనెల ఒకటి నుంచి 31 వరకు ట్రైనింగ్



సాక్షి, సిద్దిపేట : బాలబాలికల్లో క్రీడానైపుణ్యం పెంచడం కోసం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లా యువజన, క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. శిక్షణ కోసం 14 యేళ్ల లోపు వారుమాత్రమే అర్హులు.శిక్షణ ఇచ్చేందుకు ఇదివరకే కోచ్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 35 మంది దరఖాస్తు చేసుకోగా క్రీడాంశాల వారీగా 21 మందిని ఎంపిక చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి 31 వరకు ట్రైనింగ్ ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా 21 చోట్ల 10 రకాల క్రీడలపై శిక్షణ కోసం ఏర్పాట్లు పూర్తిచేశారు.

- ప్రతీ రోజు ఉదయం 6 నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటలకు శిక్షణ ఇవ్వనున్నారు.
- శిక్షణ శిబిరాల్లో ఏ క్రీడ నిర్వహిస్తారో ఆ ఆటకు సంబంధించిన స్పోర్ట్స్ మెటీరియల్ అందించనున్నారు.
- ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను 10 నుంచి 15 మందిని ఎంపికచేసి వారికి ఫ్రెండ్లీ గేమ్స్ నిర్వహించనున్నారు.
- శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేయనున్నారు
- హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక మున్సిపాలిటీల్లో క్యాంప్‌లు నిర్వహించడంలేదు. దీంతో ఇక్కడి బాలబాలికలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సద్వినియోగం చేసుకోవాలి



బాలబాలికలు సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. శిక్షణ సందర్భంగా వారిలో దాగి ఉన్న క్రీడాప్రతిభ వెలికి తీయొచ్చు. తల్లితండ్రులు అందుబాటులో ఉన్న శిబిరాలకు పంపించాలి. పిల్లలను చదువులతో క్రీడల్లో రాణించేలా ప్రోత్సహించాలి.

–నాగేందర్, డీవైఎస్ఓ

క్రీడ.. శిక్షణ ప్రాంతం.. కోచ్‌ల వివరాలు

క్రీడాంశం	స్థలం	కోచ్ పేరు	ఫోన్ నంబర్
అథ్లెటిక్స్	రాఘవపూర్	కృష్ణ కుమార్	9704661898
అథ్లెటిక్స్	కొండపాక	నిశాంత్‌గౌడ్	8501977079
బాల్‌బాడ్మింటన్	మిరుదొడ్డి	భైరయ్య	9704746511
ఫుట్‌బాల్	దుద్దెడ	అజార్ షరీఫ్	9014700450
హ్యాండ్‌బాల్	మద్దూరు	మల్లేశం	9676223326
హ్యాండ్‌బాల్	బెజ్జంకి	అశోక్	9014397661
కబడ్డీ	చోటుపల్లి	నాగరాజు	8106794398
జూడో	బస్వాపూర్	భరత్	9505450223
కరాటే	జగదేవ్‌పూర్	అంజయ్య	9866402615
కరాటే	కొమురవెల్లి	ప్రభాకర్	9963567656
కరాటే	రాయపోలు	నరేందర్	9949760656
ఖోఖో	గంగాపూర్	మహేశ్	9014581059
వాలీబాల్	ధర్మాజీపేట	ప్రశాంత్	8374041037
వాలీబాల్	రాయపోలు	కనకయ్య	9666041795
వాలీబాల్	చిన్న కోడూరు	విగ్నేశ్	9701629849
యోగా	మర్పడగ	పూజిత	9963458830
అథ్లెటిక్స్	సిద్దిపేట	లీలాఆనంద్	9666020322
ఫుట్‌బాల్	సిద్దిపేట	మోయిజుద్దీన్	9989484657
ఫుట్‌బాల్	గజ్వేల్	నగేశ్	9908789877
కరాటే	గజ్వేల్	నరేశ్	9866698411
కరాటే	ఇందిరానగర్	ఎల్లయ్య	9949540074

ఫోర్‌లేన్ చకచకా

సిద్దిపేట చుట్టూ రోడ్లు

- రూ.132.5 కోట్లతో భారీ ప్రాజెక్టులు
- డివైడర్, సెంట్రల్ లైటింగ్ హంగులు
- రూ.8.5కోట్లతో ఎన్సాన్ పల్లి రోడ్డు
- వేగంగా సాగుతున్న పనులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రం సిద్దిపేట చుట్టూ ఫోర్ లేన్ అల్లుకుంది. ట్రాఫిక్ ఇబ్బందులు.. రవాణా సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఫోర్ లేన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.132.5 కోట్లలో పట్టణం చుట్టూ నాలుగు వరసుల రహదారులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆయా రోడ్ల పనులు చకచకా సాగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్, డివైడర్, మధ్యలో పచ్చని మొక్కలు జంటనగరాల తరహాలో రోడ్లు వేస్తున్నారు. రూ.3.50 కోట్లతో వేములవాడ కమాన్ నుంచి ఎల్లమ్మ గుడి వరకు, రూ.3 కోట్లతో నర్సాపూర్ చౌరస్తా నుంచి కరీంనగర్ బైపాస్ రోడ్డు వరకు, రూ. 16 కోట్లతో ముస్తాబాద్ చౌరస్తా నుంచి పుల్లూర్ శివారు వరకు, రూ. 4 కోట్లతో రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బూర్గుపల్లి వరకు, రూ. 40 కోట్లతో ఎల్లమ్మగుడి నుంచి రామంచ వరకు, రూ. 66 కోట్లతో ఎల్లమ్మ గుడి నుంచి చిన్నకోడూర్ వరకు ఫోర్ లేన్ పనులు చేపట్టారు.

హైటెక్ హంగులు...

సిద్దిపేట పట్టణ శివార్లలో ఉన్న ఎన్సాన్ పల్లి రహదారికి హైటెక్ హంగులు సంతరించుకున్నాయి. రూ.8.50 కోట్లతో సిద్దిపేట నుంచి ఎన్సాన్ పల్లికి ఫోర్ లేన్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్, డివైడర్ మధ్య చెట్లతో ఫోర్ లేన్ నిర్మిస్తున్నారు. పనులను మంత్రి హరీశ్‌రావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సూచనలు చేస్తున్నారు. ఒకప్పుడు గుంతలు, గతుకుల రోడ్లతో ఇబ్బందులు పడ్డ జనం ఫోర్ లేన్ రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎన్సాన్ పల్లి ఫోర్‌లేన్

రూల్స్ పాటించేలా చూడాలి

- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘించేవారిపై చర్యలు తీసుకోవాలి
- డీజీపీ అంజనీకుమార్

సిద్దిపేటకమాన్: వాహనదారులు పరిమితికి మించి వేగంగా వాహనాలు నడిపేవారు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. రోడ్డు భద్రతా అంశాలపై గురువారం జిల్లా పోలీసు అధికారులతో హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ అవర్ అనేది కీలకమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతీఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. త్వరలో గ్రామ రహదారి భద్రతా కమిటీలు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అతివేగంతోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల మధ్యలోనే యాక్సిడెంట్లు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో నివారణ చర్యలు తీసుకోవాలని పోలీసు ఆఫీసర్లను ఆదేశించారు. ప్రమదాల్లో గాయపడ్డ వారికి చికిత్స అందేలా చేయడం, డివైడర్ల ఏర్పాటు, రోడ్ల వెడల్పు, గ్రామీణ యువత డ్రైవర్లకు రోడ్డు భద్రతపై కమ్యూనిటీ పోలిసింగ్ కళాబృందం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, రాజీవ్ రహదారిపై స్పీడ్ బిగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏసీపీలు రమేశ్, సతీశ్, ఫణిందర్, చంద్రశేఖర్, ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, తిరుపతి హాజరయ్యారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్, పోలీసు అధికారులు

పనులు మరింత వేగం

- ఎస్ఈ ఆఫీస్, డివిజన్, ఎన్‌హెచ్ డివిజన్ మంజూరు
- జగదేవ్‌పూర్ సబ్ డివిజన్, సిద్దిపేటకు సబ్ డివిజన్
- పునర్వ్యవస్థీకరణ చేసిన ఆర్అండ్‌బీ
- వచ్చేనెల 4 నుంచి సేవలు ప్రారంభం

సాక్షి, సిద్దిపేట : సిద్దిపేట జిల్లాలో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగనున్నాయి. ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చొరవతో రోడ్లు, భవనాల(ఆర్అండ్‌బీ) సర్కిల్ ఇంజినీర్, గజ్వేల్‌కు డివిజన్ ఇంజినీర్, ఎన్‌హెచ్ డివిజన్ ఇంజినీర్, జగదేవ్‌పూర్‌కు సబ్ డివిజన్, సిద్దిపేట జిల్లాకు బిల్డింగ్స్ సబ్ డివిజన్ కార్యాలయాలు మంజూరయ్యాయి. వచ్చేనెల 4 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

సిద్దిపేటలో ఎస్ఈ కార్యాలయం

- సిద్దిపేట, మెదక్ జిల్లాలను కలుపుతూ సిద్దిపేటలో ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు కానుంది. రోడ్లు, భవనాల శాఖ(ఆర్అండ్‌బీ) ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనుల మంజూరు, అగ్రిమెంట్లు స్థానికంగానే జరగనున్నాయి.
- గతంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ నిధులు మంజూరు కోసం సంగారెడ్డిలోని ఎస్ఈ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సిద్దిపేటకు ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో అభివృద్ధి పనులకు సంబంధించి రూ.50 లక్షల వరకు టెక్నికల్ పర్మిషన్ ఇక్కడే ఇవ్వనున్నారు.
- గతంలో సంగారెడ్డికి ఫైల్ వెళ్లి మంజూరై వచ్చే సరికి ఆలస్యమయ్యేది. ఇప్పుడు అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు అగ్రిమెంట్లు కూడా స్థానికంగానే పూర్తిచేయనున్నారు.

రెండు ఈఈ కార్యాలయాలు

జిల్లాలో ప్రస్తుతం సిద్దిపేటలోనే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) ఉండేవారు. ఆర్అండ్‌బీ పునర్వ్యవస్థీకరణతో సిద్దిపేటతో పాటు గజ్వేల్ సబ్ డివిజన్ కార్యాలయాలను అప్‌గ్రేడ్ చేస్తూ ఈఈ ఆఫీస్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీని పరిధిలో సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్ ఈఈ పరిధిలో గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు చేర్చారు.

- జాతీయ రహదారుల(ఎన్‌హెచ్) ఈఈ కార్యాలయం సైతం మంజూరు అయ్యింది. గతంలో ఇది కరీంనగర్ పరిధిలో కొనసాగేది.
- సిద్దిపేటకు బిల్డింగ్స్ సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు చేశారు. జగదేవ్‌పూర్‌కు ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం సైతం మంజూరు అయింది.



సిద్దిపేటలోని ఆర్అండ్‌బీ కార్యాలయం

అందుబాటులోకి సేవలు..

ఇటీవల ఆర్అండ్‌బీ పునర్వ్యవస్థీకరణ పూర్తయ్యింది. ఇందులో భాగంగా సిద్దిపేటకు ఎస్ఈ, గజ్వేల్‌కు ఈఈ ఆఫీసులు, సిద్దిపేట జిల్లాకు ఎన్‌హెచ్ ఈఈ ఆఫీస్ మంజూరైంది. వచ్చే నెల 4 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

– వసంత్ నాయక్, ఎస్ఈ సంగారెడ్డి

జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తూ, నాలుగు ఏండ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తిచేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం జేపీఎస్‌ల జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేపీఎస్ జేఏసీ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ చేసి నాలుగేళ్లగా ప్రొబేషన్ కాలంగా పనులు చేయించుకుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తూ గ్రామాలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవడంలో కీలకపాత్ర వహిస్తున్నారని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



రాంసాగర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్కైలాబ్ బాబు

కొమురవెల్లి(సిద్దిపేట): రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబు అన్నారు. మండలంలోని రాంసాగర్ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం స్థానిక సర్పంచ్ రవీందర్‌తో కలసి ఆవిష్కరించారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ పరమేశ్వర్, మాజీ జెడ్పీటీసీలు దాసరి కళావతి, నర్సింగరావు, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, బాలకిషన్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

భగీరథ మహర్షి మార్గంలో నడవాలి

సిద్దిపేటరూరల్: ప్రతీ ఒక్కరు భగీరథ మహర్షి అడుగుజాడల్లో నడవాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతి అధికారికంగా నిర్వహించడం గొప్పవిషయమన్నారు. ఈతరం యువత మహర్షి జీవిత చరిత్ర తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. బట్రాజ్ కులసంఘ పెద్ద రాజేంద్రప్రసాద్ బట్టు మాట్లాడుతూ భగీరథ మహర్షి మనిషి ఒక శక్తిని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తాగునీటి పథకానికి మిషన్ భగీరథ పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మురళి పాల్గొన్నారు.



భగీరథ మహర్షికి నివాళి అర్పిస్తున్న అధికారులు, లీడర్లు

మల్లన్న ఆలయంలో తనిఖీలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో దేవాదాయశాఖ అదనపు కమిషనర్ కె.జ్యోతి తనిఖీలు చేశారు. గురువారం ఆలయంలోని పలు రికార్డులు, ఆలయ ఆదాయం, ఖర్చులు, భక్తుల సౌకర్యాలు, ప్రసాద విక్రయాలు, టికెట్ల విక్రయం, ప్రసాద విక్రయాలు, ఐటీ, డోనర్స్ వివరాలు పరిశీలించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, బాలాజీ, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.



కొమురవెల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ జ్యోతి



ఎర్రవల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

అభివృద్ధి పనులు భేష్

మర్కూక్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలోని మర్కూక్ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు బాగున్నాయని హిమాచల్‌ప్రదేశ్ ప్రజా ఇన్ఫ్రా రూరల్ డెవలప్‌మెంట్ ప్రతినిధులు, అధికారులు బగంగ్, తాబిన్‌మరా, జరంగ్, దల్‌నర్సమ్, తంగల్ కొనియాడారు. గురువారం మండలంలోని ఎర్రవల్లి, మర్కూక్ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. నర్సరీ, ఆయిల్‌పామ్, డంపుయార్డు, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికను పరిశీలించారు.పనుల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ర్యక్రమంలో సర్పంచులు భాగ్యభిక్షపతి, భాస్కర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి విక్రేత అరెస్ట్

గజ్వేల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని 100గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి మార్గంలో చోటు చేసుకుంది. సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... రాజస్థాన్ ప్రాంతానికి చెందిన సంతోషి జీవనోపాధి కోసం గజ్వేల్‌కు వచ్చి నివాసముంటున్నాడు. రాజస్థాన్ నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి గజ్వేల్ ప్రాంతంలో పలువురికి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఎస్ఐ నరేష్ సిబ్బందితో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఐడీ పార్టీ సిబ్బంది వెంకటేశ్, యాదగిరి, రవి, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం


సాధు సాయి కుమార్ (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఏడుపాయల్లోని కన్వెన్షన్ సెంటర్ వెనకాల గుట్టపై చెట్టుకు ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో ఓ మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపల్లికి చెందిన సాధు అంతయ్య, మంజుల కుమారుడు సాధు సాయి కుమార్(22) ఏడుపాయల కమాన్ వద్ద టెంట్ హౌజ్‌లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రెండు మూడు రోజుల కోసారి ఇంటికొచ్చి వెళ్లేవాడు. ఈ క్రమంలో ఉగాది తర్వాత కనిపించకుండా పోయాడు. కుటుంబీకులు ఎంత వెతికినా ప్రయోజనం లేక పోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం ఏడుపాయల్లో చెట్టుకు ఉరి వేసుకున్న మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు



దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం పోతారెడ్డిపేట వద్ద గురువారం సిద్దిపేట వైపు నుంచి వస్తున్న ఒక కారు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రక్కన కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఎస్ఐ గంగరాజును వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

దౌర్జన్యం చేసిన వీఆర్ఏపై ఫిర్యాదు

నారాయణఖేడ్: గౌడకులస్థులను దూషించి కల్లుదుకాణంపై దాడిచేసి దౌర్జన్యానికి పాల్పడ్డ నిజాంపేట్ వీఆర్ఏ బేతయ్యపై చర్యలు తీసుకోవాలని గురువారం ఆ సంఘం నాయకులు తహసీల్దార్ మదన్‌కు, సర్పంచ్ జగన్‌వారికి వినతిపత్రాలు సమర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి..వీఆర్ఏ బేతయ్య కల్లు దుకాణంపై దాడిచేయడమే కాకుండా నిర్వాహకుడిని కులంపేరుతో దూషించి కల్లుసీసాలను ధ్వంసం చేసి దౌర్జన్యానికి పాల్పడ్డాడని సంఘం నాయకులు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించే వీఆర్ఏ ఈ విధంగా దౌర్జన్యానికి పాల్పడడం దారుణమని అన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో కోరారు.

అంతా సిద్ధం...

- రేపే నవోదయ ఎంట్రెన్స్
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలు



వర్గల్ నవోదయ విద్యాలయం

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్‌జిల్లావ్యాప్తంగా నవోదయ ఎంట్రెన్స్ టెస్ట్‌కు రంగం సిద్ధమైంది. 2023-24 విద్యాసంవత్సరంలో ఆరోతరగతి ప్రవేశం కోసం ఈ నెల 29న నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఆయా జిల్లాల యంత్రాంగం సన్నద్ధమైంది. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, వర్గల్ నవోదయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మూడు జిల్లాల్లో పరీక్ష నిర్వహణకు సంబంధించి సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు, సెంటర్ సూపరింటెండెంట్లకు ఓరియంటేషన్ కూడా నిర్వహించారు. ఏర్పాట్లకు సంబంధించిన వివరాలు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రమేష్‌రావు వెల్లడించారు.

5691 మంది విద్యార్థులు

నవోదయ ప్రవేశ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 5691 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

- సంగారెడ్డి జిల్లా నుంచి 2337, మెదక్ జిల్లా నుంచి 1504, సిద్దిపేట జిల్లా నుంచి 1850 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు.
- సంగారెడ్డి జిల్లాలో 12, మెదక్ జిల్లాలో 7, సిద్దిపేట జిల్లాలో 10 చొప్పున మొత్తం 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్ష నిర్వహించేందుకు ప్రతి కేంద్రంలో ఒక సెంటర్ సూపరింటెండెంట్, ఒక సెంటర్ లెవల్ అబ్జర్వర్‌ను నియమించారు.
- విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు, ఒక ఇన్విజిలేటర్ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కేంద్రాలపై పర్యవేక్షణ బాధ్యతను మండల విద్యాధికారులకు అప్పగించారు.

సమాచారం కోసం హెల్ప్‌డెస్క్

నవోదయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సమాచారం, అనుమానాల నివృత్తి కోసం ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు.

హెల్ప్‌డెస్క్ సెల్‌నంబర్లు:

- ఎం కృష్ణారెడ్డి(లైబ్రేరియన్): 98666 48838
- నవోదయ వైస్ ప్రిన్సిపాల్: 73820 86533
- ఎన్వీ సుబ్బారెడ్డి (అధ్యాపకుడు): 94903 56731
- విద్యాపాటిల్ (ఎఫ్‌సీఎస్ఏ): 88841 78433

పరీక్ష కేంద్రాలకు ముందే చేరుకోవాలి



శనివారం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ఉదయం 10.30 గంటల వరకు చేరుకోవాలి. ఉదయం 11.30 తర్వాత అనుమతి ఉండదు. అభ్యర్థులు తమ వెంట హాల్‌టికెట్(అడ్మిట్‌కార్డు), రైటింగ్ ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను తీసుకురావాలి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఉంటుంది.

– రమేష్‌రావు, వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్

సైబర్ నేరాలపై అవగాహన

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతారెడ్డిపేటలో గురువారం సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రవీందర్ సైబర్ నేరాలు, దిశ యాప్స్, పోక్సో కేసులు, మహిళలపై జరుగుతున్న దాడులు, రోడ్డు భద్రత, వాహనాల ఇన్సూరెన్స్, హెల్మెట్ ధరించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లో వచ్చే మెసెజ్‌లకు స్పందించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎంపీటీసీ చందసాగర్, కానిస్టేబుల్ రాజిరెడ్డి, సంపత్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌రూరల్‌లో

హుస్నాబాద్‌రూరల్: సైబర్‌నేరాలపై జాగ్రత్తంగా ఉండాలని ఎస్ఐ మహేశ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి మహ్మదాపూర్ గ్రామంలో సైబర్ నేరాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువత సైబర్ నేరాలపై అవగహన పెంచుకోవాలన్నారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయొద్దన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే 100 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల సంపత్, ఎంపీటీసీ పిట్టల శ్రావణి, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కరుడుగట్టిన నేరస్తుడి అరెస్ట్

- బీబీపేట వరుస దొంగతనాల కేసులు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరెడ్డి

కామారెడ్డి క్రైం: వారం క్రితం బీబీపేటలో జరిగిన వరస దొంగతనాల కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఓ కరుడుగట్టిన పాత నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. బీబీపేటలో వారం రోజుల క్రితం మూడిళ్లలో వరుస చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలను బట్టి నిందితుడిని సిద్దిపేట జిల్లా తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన వెంగలి భిక్షపతి అలియాస్ చిక్కుడు కృష్ణగా గుర్తించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామంలోని బంధువుల ఇంట్లో తలదాచుకున్న నిందితుడిని గురువారం అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి జల్సాలకు ఖర్చు చేయగా మిగిలిన 28.5 తులాల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

జల్సాల కోసం చోరీలు

వరుస చోరీల కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న తర్వాత అతడు ఓ కరుడుగట్టిన నేరస్తుడని వెల్లడైంది. జల్సాల కోసం చోరీలకు పాల్పడేవాడు. గతంలో 50 దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉండి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. కరీంనగర్ జైలు నుంచి ఏడాదిన్నర క్రితం విడుదలయ్యాడు ఆ తర్వాత జైలుకు సంబంధించిన పెట్రోల్ బంకులో నెలకు రూ.13,500 జీతానికి పని చేస్తున్నాడు. వచ్చే జీతం డబ్బులు సరిపోక మళ్లీ దొంగతనాలు మొదలుపెట్టాడు. అతడు దొంగతనం చేయడానికి ముందుగా ఓ గ్రామాన్ని ఎంచుకుంటాడు. రెండు నుంచి మూడు రోజులపాటు రెక్కీ నిర్వహిస్తాడు. అప్పటిదాకా పరిసర ప్రాంతాల్లోని చెట్ల కింద ఎవరికి కనిపించకుండా పడుకుంటూ రాత్రి వేళ చోరీలకు పాల్పడి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతాడు. అక్కడ జల్సాలు చేసి మళ్లీ వస్తాడు. ఈ కేసులో నిందితుడిని గుర్తించడం, అరెస్టు చేయడంలో విశేషంగా కృషి చేసిన కామారెడ్డి డీఎస్పీ సురేష్, భిక్కనూర్ సీఐ తిరుపతయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ మల్లేశం, బీబీపేట, మాచారెడ్డి, రాజంపేట, రామారెడ్డి ఎస్సైలు సాయికుమార్, సంతోష్, రాజు, అనిల్, ఉస్మాన్, సిబ్బంది మైసయ్య, కిషన్, నవీన్, శ్రీనివాస్, ప్రవీణ్, బాలయ్య, శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

వీడియోలు, కాల్ రికార్డుల పేరుతో సైబర్ మోసం

సిద్దిపేటకమాన్: వీడియో రికార్డులను, కాల్ రికార్డులను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానంటూ బెదిరించిన ఘటనలో గుర్తు తెలియని వ్యక్తికి డబ్బులు పంపి మోసపోయిన సంఘటన చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్ కమిషనర్ శ్వేత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి గత పది రోజులుగా వీడియో కాల్స్ మాట్లాడావని బాధితుని మాటలు రికార్డు చేశానని ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని గుర్తు తెలియని వ్యక్తి బెదిరించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నెంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.21,500 పంపాడు. తర్వాత ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తను మోసపోయినట్టుగా గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో

సిద్దిపేట పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రివార్డ్ పాయింట్స్ గడువు ముగుస్తుందని ఒకసారి చెక్ చేసుకోవాలని తెలిపాడు. సైబర్ మోసగాడు పంపిన లింకును ఓపెన్ చేసి అందులో బ్యాంక్ వివరాలు, ఓటీపీ నెంబర్ నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.14,441 డబ్బులు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు సైబర్ మోసం జరిగినట్లు గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో

ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి పార్ట్ టైం ఉద్యోగం ఉందని తన వివరాలు నమోదు చేయాలని ఓ లింకును పంపాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు సైబర్ మోసగాడు పంపిన లింకును ఓపెన్ చేసి టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ అయ్యాడు. అనంతరం డబ్బులు పెట్టుబడిగా పెడితే ఎక్కువ మొత్తంలో లాభం వస్తాయని ఆశ చూపాడు. దీంతో బాధితుడు రూ.13వేలు ఆన్‌లైన్‌లో పంపి మోసపోయాడు. వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి మృతి

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి వడియారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కరీంనగర్ గ్రామానికి చెందిన పోచయ్య(56) మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన వెంట వచ్చిన కూలీలను వడియారం గ్రామంలో బైక్‌పై దింపడానికి వెళ్లాడు. కూలీలను దింపి తిరిగి వస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

నారాయణఖేడ్: తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ పట్టణంలో 90 ఏళ్ల ఓ వృద్ధుడు రెండురోజులుగా సంచరిస్తున్నాడని గురువారం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు, అంబేడ్కర్ ఫౌండేషన్ నిర్వాహకులు సంజీవ్‌కుమార్, రాజ్‌కుమార్ అతణ్ని గుర్తించారు. అనంతరం వృద్ధుడిని ఆరా తీయగా కర్ణాటకలోని చిల్లర్గీ గ్రామమని, తన పేరు వడ్ల మోనప్ప అని వివరాలు చెప్పాడు. తాను తప్పిపోయి ఇక్కడకు చేరుకున్నానన్నాడు. వెంటనే ఈ విషయాన్ని అటుగా వెళుతున్న కానిస్టేబుల్ రమేశ్‌కు సమాచారమిచ్చారు. అనంతరం ఎస్ఐ వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వృద్ధుడి కుటుంబీకులకు సమాచారం అందజేసి వివరాలను నిర్ధారించుకున్నతరువాత వృద్ధుడిని కుటుంబ కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నారాయణఖేడ్: ఏడాదికిందట పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసుశాఖ పోర్టల్‌తో ఆచూకీ తెలుసుకొని బాధితుడికి అప్పగించారు. నారాయణఖేడ్‌కు చెందిన పంచాయతీ కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను ఏడాదిక్రితం పోగొట్టుకున్నాడు. పోలీసుశాఖ పోర్టల్‌లో మీసేవ ద్వారా దరఖాస్తు చేశాడు. ఫోన్ ఆన్‌లో ఉన్నట్లు తెలియడంతో పోలీసులు సదరు వ్యక్తినుంచి ఆఫోన్‌ను రికవరీ చేశారు. గురువారం సీఐ రామకృష్ణారెడ్డి దాన్ని ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న హెల్పర్..


మహేందర్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బండారుపల్లిలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన బుచ్చక్క మహేందర్ (41) గత కొంత కాలంగా గ్రామపంచాయతీ హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3న మెట్టు సబ్ స్టేషన్ సమీపంలో కరెంట్ మరమ్మలు చేయాలని లైన్‌మైన్ తీసుకుపోయాడు. అక్కడ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో మహేందర్‌కు తీవ్రగాయాలవ్వడంతో చికిత్సనిమిత్తం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యలక్ష్మీ, కుమార్తెలు వర్షిత, లిఖిత, కుమారుడు అవినాష్ ఉన్నారు.

దూడపై కుక్కలు దాడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుక్కల దాడిలో దూడకు గాయాలైన సంఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోళ్ల సత్తయ్యకు చెందిన దూడ ఇంటి ముందు ఉండగా కుక్కలు దాడి చేశాయి. దీంతో దూడకు గాయాలవడంతో పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

మద్యానికి బానిసై వ్యక్తి..


మల్లేశం (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మద్యానికి బానిసైన వ్యక్తి ఇంట్లో గొడవపడి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన మల్లేశం(62)మద్యానికి బానిసై ఇంటివద్దే ఉంటున్నాడు. పలుమార్లు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని భార్యాపిల్లలతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం కూడా భార్య జయమ్మ, కొడుకు నరేష్‌తో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవ పడ్డాడు. డబ్బులు లేవని చెప్పడంతో తనను ఎవరూ పట్టించుకోవడం లేదని మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో అతడిని కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్సకోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మల్లేశం మృతిచెందినట్లు చెప్పారు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత


పాడి గేదె కళేబరం

నంగునూరు(సిద్దిపేట): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన గురువారం ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏర్వ విఠల్ గేదె పాలు పితికినంతరం మేతమేయడానికని వ్యవసాయ బావి వద్ద వదిలిపెట్టాడు. అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైర్లను ఎవరూ గమనించ లేదు. దీంతో అక్కడ గడ్డి మేస్తున్న గేదె కింద పడి ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాడి గేదె మృతితో రూ.60 వేల నష్టం జరిగిందని రైతు బోరున విలపించాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

కూలిన ఇంటి పైకప్పు

శివ్వంపేట(నర్సాపూర్): అకాల వర్షానికి పెంకుటిల్లు పై కప్పు కూలిన సంఘటన మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఫయాజ్ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి పైకప్పు కూలింది. మట్టి పెల్లలు మీద పడడంతో ఫయాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమై కుటుంబ సభ్యులను తీసుకొని బయటకు వచ్చాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పార్వతిసత్యం పరామర్శించారు. ప్రభుత్వం ఫయాజ్‌కు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): రవీంద్రనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ బర్మ కొమురయ్య ఎంపీడీఓ రాంరెడ్డిని కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొమురయ్య, సీఐటీయూ నాయకులు కనుకాచారి, అమ్ముల బాల్‌నర్సయ్యలు మాట్లాడుతూ రవీంద్రనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి కేటాయించిన భూమి కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించారన్నారు. ఈ విషయంలో గతంలో తహసీల్దార్‌ను సంప్రదించగా విచారణానంతరం నకిలీదని నిర్ధారించారన్నారు. ఐనప్పటికీ ఆక్రమితదారులు మొండికేయడంతో తహసీల్దార్ విచారణ రిపోర్టు ఆధారంగా కోర్టును ఆశ్రయించామన్నారు. ఈ విషయంలో ఆక్రమిత భూమిలోంచి సీసీ రోడ్డు పనుల కోసం ఉపయోగించుకోవచ్చని కోర్టు తీర్పునిచ్చిందన్నారు. కోర్టు తీర్పు ఆధారంగా సీసీ రోడ్డు పనులను ప్రారంభించేందుకు వెళ్లగా ఆక్రమితదారులు పనులు చేయనియ్యకుండా అడ్డుకుటుంన్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని ఎంపీడీఓ రాంరెడ్డికి వినతి పత్రంలో కోరామని నాయకులు చెప్పారు.

ఏసీబీ వలలో ములుగు ఆర్ఐ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ అధికారులు

ములుగు(గజ్వేల్): సిద్దిపేట జిల్లా ములుగు తహసీల్దార్ కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ జావెద్‌పాష లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. గురువారం రాత్రి ఆర్ఐని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ములుగు మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ జావెద్‌పాష పనిచేస్తున్నాడు. మండలంలోని నర్సంపల్లికి చెందిన చెన్నోజు అఖిల్ తల్లి పేరిట 162-31-బి, 161-32-బి సర్వే నంబర్‌లో ఎకరా 14 గుంటల భూమిని మ్యుటేషన్ కోసం మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. కాగా నివేదికను తహసీల్దార్‌కు సమర్పించేందుకు ఆర్ఐ జావెద్‌పాష లంచం డిమాండ్‌చేశాడు. అంత ఇవ్వలేమని చెప్పగా, రూ.60వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ తర్వాత రూ.50వేలకు తగ్గించాలని కోరగా ఆర్ఐ నిరాకరించాడు. దీంతో అఖిల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వలపన్ని పట్టుకున్నారు. నిందితున్ని అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

గుర్తుతెలియని వాహనం ఢీ కొని..

చేగుంట(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాసాయిపేట శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మాసాయిపేటకు చెందిన పల్లపు వెంకటేశ్(36) వడ్డెర వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం సాయంత్రం పనికెళ్లాడు. బండవద్ద నుంచి పనులు ముగించుకుని వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన వెంకటేశ్‌ను తూప్రాన్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..


శారద (ఫైల్)

ములుగు(గజ్వేల్): ములుగు రెవెన్యూ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ములుగు ఏఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం..సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన బూర్గుల శారద(38) మేడ్చెల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లోని చిలుకనగర్‌లో నివాసముంటున్నారు. మృతురాలు శారద తన భర్త బూర్గుల బాలుగౌడ్, బావ కూతురు రమ్యలు ముగ్గురు కలిసి హోండా ఆక్టీవా వాహనంపై గురువారం ఉదయం బెజ్జంకి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. ములుగు రెవెన్యూ కార్యాలయ సమీపంలోకి చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి రాజీవ్‌రహదారిపై పడ్డారు. ద్విచక్రవాహనం వెనకాల కూర్చున్న మృతురాలు శారద రోడ్డుపై పడి లేచే క్రమంలో అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం అటునుంచి వస్తున్న కారును ఢీకొంది. ఆ కారు శారద ఛాతిపై నుంచి దూసుకెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైనా శారద అక్కడికక్కడే దుర్మరణం చెందింది. డీసీఎం వాహన డ్రైవర్ సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

మొక్కజొన్న కంకులు విక్రయించే మహిళ..


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో మొక్కజొన్న కంకులు విక్రయించే ఓ మహిళ మృతి చెందిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుండన్నపల్లికి చెందిన ఎక్కలదేవి రాజవ్వ(58)రోజు మాదిరిగానే గురువారం సైతం గుండన్నపల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై మొక్కజొన్న కంకులను విక్రయిస్తుంది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు అతివేగంగా వస్తున్న ఫార్చునర్ కారు ఢీకొనడంతో రాజవ్వ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.